క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని వారి నివాసంలో పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

ప్రసన్నకుమార్‌రెడ్డికి అభినందన



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమారెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, సురేష్ రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి అభినందనలను తెలియజేశారు.

బహుభాషా సాహిత్య సంచిక ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): తొలి బహుభాషా సాహిత్య సంచిక సాహిత్య నిధిని కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో వీసీ అల్లం శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. తొలి ప్రతిని హైదరాబాద్‌కు చెందిన కవి బండారు ప్రసాద్‌మూర్తికి అందజేశారు. సాహిత్య నిధి వ్యవస్థాపక ప్రధాన సంపాదకుడు పెరుగు రామకృష్ణ, విశ్వవిద్యాలయ లోగో సృష్టికర్త అరవ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సోలార్ విద్యుత్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మాగుంట లేఅవుట్లోని వినియోగదారుల ఇళ్లకెళ్లిన ఆయన సోలార్ విద్యుత్ వినియోగంతో ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో వివరించారు. నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, ఏఈ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళా సత్తా అధ్యక్షురాలిగా షబానా

నెల్లూరు(బృందావనం): ప్రజాసత్తా ముస్లిం మైనార్టీ సంక్షేమ అనుబంధ విభాగ ముస్లిం మహిళా సత్తా నెల్లూరు నగర మహిళాధ్యక్షురాలిగా ఖుద్దూస్‌నగర్‌కు చెందిన షబానా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వ్యవస్థాపక అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు తెలిపారు. ఈ మేరకు కోటమిట్టలో ముస్లిం మహిళా సత్తా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

ఎఫ్ఏఐటీపీఏ - బీసీసీ చైర్మన్‌గా దీపక్

నెల్లూరు(బృందావనం): అఖిల భారత ఐటీ అసోసియేషన్స్ సమాఖ్య బ్రాండ్ కో ఆర్డినేషన్ కమిటీ (ఎఫ్ఏఐటీపీఏ - బీసీసీ) చైర్మన్‌గా నెల్లూరుకు చెందిన దీపక్ బొమ్మిశెట్టి నియమితులయ్యారు. సభ్యుల నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు.. ఆఫ్‌లైన్, భౌతిక రిటైల్‌పై వినియోగదారుల విశ్వాసాన్ని నిర్ధారించేందుకు కమిటీ కృషి చేస్తుందని వివరించారు.

'అగ్నివీర్' రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

నెల్లూరు రూరల్: అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన దరఖాస్తుల గడువును ఈ నెల 25 వరకు పొడిగించారని కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీర్‌లోని వివిధ కేటగిరీల్లో రిక్రూట్‌మెంట్ కోసం joinindianarmy.nic.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్ మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొంగుతున్న కాలువలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో గల కాలువలు నిండిపోవడంతో రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తోంది. రోడ్డు వెడల్పు ప్రక్రియలో భాగంగా చాలా గృహాలను తొలగించారు. ఈ క్రమంలో మట్టి, రాళ్లు, కంకర తదితర వ్యర్థాలను స్థానికంగా ఉన్న కాలువల్లో పడేశారు. అయితే వీటిని తొలగించకపోవడంతో కాలువలు పూడిపోయాయి. దీంతో రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న డ్రైనేజీ పైప్‌లైన్ల ద్వారా ఇవి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా దోమలు, దుర్గంధంతో స్థానికుల పాట్లు వర్ణనాతీతమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కోదండరాముడికి ప్రత్యేక పూజలు



నెల్లూరు సిటీ: పొదలకూరు రోడ్డు సమీపంలోని ప్రగతినగర్ ఏడో వీధిలో కొలువైన కోదండరామస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను మంగళవారం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కలవనబోయిన సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్లు మునికిశోర్, కోగిలి సురేష్, రమేష్‌రాజ్, సెక్రటరీ శ్రీనివాసులు, మునిశేఖర్, వీరేష్‌కుమార్, మునివెంకటసూర్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం



నెల్లూరు సిటీ: పొట్టేపాళెంలో కొలువైన కోదండరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని మంగళవారం జరిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి హాజరై రథాన్ని లాగారు. బండి శ్రీకాంత్‌రెడ్డి, ఎడవల్లి సుధాకర్, ఎడవల్లి వెంకటేశ్వర్లు, అంబటి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, ఉప్పాల వెంకటేశ్వర్లు, ఎరుక శివకుమార్, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, జిల్లా సెక్రటరీ బద్దెపూడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): అతి తక్కువ ఖర్చుకే అత్యాధునిక టెక్నాలజీతో రోబోటిక్ సాయంతో మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహిస్తున్నామని అపోలో సూపర్‌స్పెషాల్టీ వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ శ్రీరామ్ సతీష్, ఆర్థోపెడిక్ సర్జన్లు వివేకానందరెడ్డి, శశిధర్‌రెడ్డి మాట్లాడారు. ఈ తరహా శస్త్రచికిత్సల్లో అపోలో ఆస్పత్రి ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. రోబోటిక్ సర్జరీల్లో అతి తక్కువ రక్తస్రావం ఉంటుందని, శస్త్రచికిత్సకు సంబంధించిన మచ్చలూ ఉండవని తెలిపారు. రెండో రోజే నడిపిస్తారని, రోగులు వేగంగా కోలుకుంటారన్నారు. నగరంలో తమ ఆస్పత్రిని ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా అతి తక్కువ ఖర్చుకే ఆపరేషన్లను చేయనున్నామని వెల్లడించారు. ఆస్పత్రి యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

శారదకు జాతీయ స్వర్ణ నంది పురస్కారం



నెల్లూరు (టౌన్): ఉగాదిని పురస్కరించుకొని ఇందుకూరుపేట మండలం ఆదెమ్మసత్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్ కామంచి శారదకు జాతీయ స్వర్ణ నంది పురస్కారాన్ని శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో దీన్ని అందజేశారు. ఆమెను పలువురు అభినందించారు.

అంబేడ్కర్‌కు నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని లక్ష్మీవీధిలో అంబేడ్కర్ చిత్రపటానికి మంగళవారం నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. దివ్యాంగుల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, జమీర్ అహ్మద్, శీనయ్య, జహీర్, మంజు, పాస్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు మే పది తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఈడీ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దరఖాస్తులను ఎలా చేసుకోవాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 1,280 మంది లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలను అందించేందుకు ప్రభుత్వం రూ.51.81 కోట్లను మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు ఓబీ ఎమ్మెస్‌లో పోర్టల్‌లో దరఖాస్తులను నమోదు చేయాలని సూచించారు.

సబ్‌స్టేషన్లో చలివేంద్రం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు వచ్చే వారి కోసం వెంకటేశ్వరపురంలోని సబ్‌స్టేషన్లో చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. సబ్ ఇంజినీర్ చంద్రా ఆచారి, ఎల్‌వి షరీఫ్, ఏఎల్ఎంలు సుధాకర్, మనోహర్, జేఎల్ఎంలు కుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: పొదలకూరు రోడ్డు అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కార్పొరేషన్, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన నిర్వహించారు. నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నందిమండలం భానుశ్రీ పాల్గొన్నారు.

రాకపోకలు భయం.. భయంగా



గుంతలు తవ్వి అక్కడే వదిలేసిన వ్యర్థాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నిత్యం రద్దీగా ఉండే స్టోన్‌హౌస్‌పేటలోని ప్రధాన రోడ్డును అభివృద్ధి పనుల పేరిట ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. దీని ద్వారా వచ్చిన మట్టి, సిమెంట్ పెచ్చులను రోడ్డుపై వదిలేస్తున్నారు. ఫలితంగా రాకపోకలు సాగించే క్రమంలో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెద్దాస్పత్రిలో అన్నదానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పెద్దాస్పత్రిలో అన్నదానాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తన తల్లి రమణమ్మ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, కొండారెడ్డి, గోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులకు పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చేపట్టనున్న జీర్ణోద్ధరణ పనులకు సంబంధించిన పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. దాతలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత, ఆల్తూరు మహేష్‌రెడ్డి, రాధిక వ్యవహరించారని తెలిపారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి

నెల్లూరు(బారకాసు): పొదలకూరు రోడ్డులో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ విభాగాధికారులతో సమావేశాన్ని కమిషనర్ సూర్యతేజతో కలిసి మంగళవారం నిర్వహించారు. మినీబైపాస్‌ను మించిన విధంగా పొదలకూరు రోడ్డు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యంపై కేసును నవాబుపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న నసీర్, నస్రీన్ దంపతుల మధ్య కొంతకాలంగా మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో భర్తపై అలిగి ఇంటి నుంచి ఈ నెల ఐదున ఆమె ఎటో వెళ్లిపోయారు. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

నెల్లూరు(క్రైమ్): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలపై నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్లలో ఆ శాఖ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. సీనియర్ ఎల్ఎఫ్ మస్తాన్‌రావు, రామకృష్ణ, స్వరూప్‌కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏబీ సమావేశం రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశాన్ని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం పదికి నిర్వహించనున్నామని జలవనరుల శాఖ ఎస్ఈ దేశ్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రెండో పంటకు సాగునీటిని విడుదల చేసే విషయమై చర్చించనున్నామని చెప్పారు.

పనులను వేగవంతం చేయండి



మురుగునీటి శుద్ధి కేంద్రం వద్ద సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్లు, తాగునీటి సరఫరా పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. తొమ్మిదో డివిజన్లోని నవాబుపేట, కుసుమ దళితవాడ, యనమలపాళెం తదితర ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్ల పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. డ్రైనేజీ కనెక్షన్లను రూపాయికే అందిస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాల్సిందిగా ఎల్ అండ్ టీ, మెగా సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. అనంతరం అల్లీపురం రోడ్డులోని డంపింగ్ యార్డును సందర్శించారు. డ్రైవర్స్ కాలనీ, పొట్టేపాళెంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలను పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో ప్రమాణాలను తప్పక పాటించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. వెంగళరావునగర్‌లోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు



నెల్లూరు (క్రైమ్): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఐటీడీపీ కార్యకర్త అసభ్యకర పోస్టులు పెట్టారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం నెల్లూరు రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రమౌళీ పేర్కొన్నారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 'దివ్య ఆర్' అనే ఐటీడీపీ కార్యకర్త ఫేస్‌బుక్‌లోని తన అకౌంట్ ద్వారా అసభ్యకర పోస్టు పెట్టారని, చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదిరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వినోద్‌రెడ్డి, అక్కి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముసవ్వీర్‌కు సత్కారం



నెల్లూరు(బృందావనం): ప్రపంచ కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరానికి చెందిన స్వర్ణకారుడు ముసవ్వీర్‌ను రాష్ట్ర ముస్లిం స్వర్ణకార సంఘ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. కొరడావీధిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఇస్మాయిల్‌ఖాద్రి, గౌరవ సలహాదారుడు దస్తగిర్ అహ్మద్, సభ్యులు బాషా, గయాజ్, షాజహాన్, బాబు, ఖమ్రు, కలీం తదితరులు పాల్గొన్నారు.

యువతిని బెదిరించి చైన్ దోపిడీ

నెల్లూరు(క్రైమ్): యువతిని బెదిరించి ఆమె మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి దోచుకెళ్లిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వీఆర్సీ సెంటర్‌లోని ఓ పీజీ హాస్టల్లో మర్రిపాడుకు చెందిన ఓ యువతి ఏడాదిగా ఉంటూ నారాయణ హాస్పిటల్లో బయో మెడికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె స్నేహితుడు అశోక్‌కుమార్ చెన్నై నుంచి నెల్లూరుకు ఈ నెల 11వ తేదీ రాత్రి వచ్చారు. చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద ఆయన్ను స్కూటీలో ఎక్కించుకొని చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో బయల్దేరారు. వైన్‌షాపు సమీపంలో స్కూటీని పక్కన నిలిపి మూత్ర విసర్జన చేసి అశోక్ కుమార్ వచ్చారు. స్కూటీ వద్ద ఇద్దరూ మాట్లాడుకుంటుండగా, గుర్తుతెలియని దుండగుడు బైక్‌పై వచ్చి.. ఎవరు మీరు.. ఇక్కడేమి చేస్తున్నారు.. మీ తల్లిదండ్రులకు ఫోన్ చేయండని బెదిరించాడు. మెడలోని బంగారు చైన్ తీసివ్వాలని, లేని పక్షంలో చంపేస్తానని బెదిరించి ఒకటిన్నర సవర్ల గొలుసును తీసుకొని పరారయ్యాడు. దీంతో జరిగిన విషయాన్ని యువతి తన స్నేహితులకు తెలియజేసి వారి సహకారంతో బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు దర్యాప్తు చేస్తున్నారు.

భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో..



వేణుగోపాలస్వామి దేవస్థానంలో..



కోదండరామస్వామి ఆలయంలో..



బ్రహ్మోత్సవ శోభ



శబరి శ్రీరామక్షేత్రంలో..



ఆంజనేయస్వామి ఆలయంలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి అలకలతోపు, అశ్వవాహనసేవను మంగళవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా బత్తెన గౌతమ్‌రెడ్డి, శరణ్య దంపతులు వ్యవహరించారు. ఈఓ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో వెణ్ణత్తాళి ఉత్సవం, అశ్వవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా దోనిపర్తి గిరిప్రసాద్, వాణి దంపతులు, మాలకొండారెడ్డి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.
- సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి ఊంజల్‌సేవను నిర్వహించారు. ఉభయకర్తగా అమర్తలూరు భాస్కర్, అరుణ, వంశీకృష్ణ, సాయి మేఘన దంపతులు వ్యవహరించారు. ఈఓ రఘురామయ్య, మహేష్ పర్యవేక్షించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో గంగాళ తిరుమంజనం, అశ్వవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా లెక్కల బాబు, శ్యామల దంపతులు, ఆదిలక్ష్మమ్మ వ్యవహరించారు. ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.
- నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో కోదండరామ, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో ఏకాంతసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా అన్నం దయాకర్‌గౌడ్, సుబ్బరత్నమ్మ దంపతులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఏకాంతసేవతో ముగిశాయి. వసంతోత్సవం, చక్రస్నానం తదితరాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా ఇడపలపాటి వెంకటేశ్వర్లు, ఇడపలపాటి కోటేశ్వరరావు దంపతులు వ్యవహరించారు.